కొండయ్య.

"అవును కాకుండా వుంటదా? మరి ఆకపిల్లల్తోగూడిన యవ్వారమెపాయె! అయినా యిదిగో యిసువంటి గురవయ మేడోటి కట్టావంటే ఆ సందట్లోనే కాత్త సిమిటీ, రూసిని ఇటికెముక్కలు సేర్చుకుని మీ ఇల్లు గెట్టిసేసుకుంటే అనే దెపుడు?" అన్నాడు వీరప్ప, శాన్నపోసేపోయిందంటూ.

"పొఖ్ఖాడగొట్టింద్రా ఎదవను! ఆ పకారం దొంగగెడ్డి తింటే యీ వూళ్లో నీకు మంచీలు పుత్తయ్యంట్రా? అది ముండమోపి బతుకులే! అయినా యీ ముదనష్టబ్బతుకులో తిరుగుడు యాడోవుంది! అదిగో మన కెదురుగా వుండ సావుకారు గురవయ్యను నువు సొంతం ఎరగవు. ఆ పుటకే వేరు! యిప్పటికి దగ్గిర్దగ్గిర యిరవైఏళ్ల కిందట ఆ గురవయ్యా, పెళ్లాం సుక్కమ్మలు యీవూరు కట్టుగుడ్డల్తో వొచ్చారు. ఇయాల గురవయ్యకున్న ఆస్తెంతో నీకుతెల్చా? యీ యిరవై ఏళ్లల్లో లోకులకు ఆ గురవయ సేసిన తెలివిగల పనేందో, నేను పొద్దస్తమానం రెక్కలిరుసుకుంటూ లోకులకు సేసిన నష్టమేందో యిప్పటికి నాకంతు పట్టటంలా!" అన్నాడు కొండయ్య సీకట్లో నిలకడగా సూస్తూ.

"ఏందేందీ? యింకా నేను గురవయ్యది యీవూరేననీ, పుటకే సావుకారు పుటకనుకుంటున్నానే!" అన్నాడు వీరప్ప, అదేందో కాత్త యివరంగా సెప్పమన్నట్టు.

"ఆరోజుల్లో అందరూ గురవయ్యను చనగపిండి గురవయ్యనేవోరు. యిప్పుడు సావుకారు గురవయ్యంటా రందరూ. సుమారుగా యిరవై ఏళ్ళకిందట నేను పొరుగూరు తాపీపనికెల్లి సందేల గెనువుం లెంటబడి ఇంటికి తిరిగొస్తుండా. అప్పటికి పొద్దుగూకి కనుసీకటి పడ్తుండా పరమటి దిక్కున ఆకాశం ఎర్రగా వుండట్టు నాకింకా గెపితికుంది. చల్గ్గా వూరి పొలిమేర దరిదాపుల కొచ్చేతలికి రాస్తామీద నల్లగా యిద్దరు మడుసులు మా వూరికి సేర్తా అగపించారు ఇంకా స్త దగ్గిరికొచ్చేతలికి ముంగలుండ మొగపడిసి నెత్తిన ఓ చీనారేకుపెట్టె. సంకలో సిన్న ఆడగూతురు పిల్లతో ముంగల నడుస్తుంటే ఎనకనే ఒకాడగూతురు నెత్తినమూటా, సేతిలో ఒక టొక్కినా లా దసూ వూపకుంటూ కాత్తె సడ్డితో నడుస్తుండది. అట్నే గురవయ్యా, గురవయ్య పెళ్లాం సుక్కమ్మలు. నన్ను సూడంగానే ఆల్లిద్దరూ 'బాబ్బాబ'ని కేకలేశారు.

"ఏ వూరు?" అనడిగాను.

